క్లుప్తంగా

దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకోవాలి


గోపాల్‌రెడ్డి, మార్కాపురం

మార్కాపురం: రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని, వారికి ప్రభుత్వం అన్నీ విధాలుగా సహకరించాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి కోరారు. దివ్యాంగులు తమ హక్కులు, చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. దివ్యాంగులకు చదువు, వయసుతో సంబంధం లేకుండా 3 చక్రాల మోటారు వాహనాలను ఇవ్వాలని, బ్యాటరీ ట్రై సైకిళ్ల, బ్యాటరీ వీల్‌చైర్లు అర్హులైన దివ్యాంగులకు అందించాలని కోరారు. నిరుద్యోగులైన దివ్యాంగులకు బ్యాంకు రుణాలు ఇప్పించాలని, కాంట్రాక్టు బేసిస్‌లో పనిచేస్తున్న దివ్యాంగులకు కూడా తిరిగి పింఛన్లు ఇవ్వాలని, అధునాతన సాంకేతిక కృత్రిమ అవయవాలు ఇవ్వాలని గోపాల్‌రెడ్డి కోరారు.

విద్యుత్ చార్జీల భారం తగ్గించాలి

మార్కాపురం: పెంచిన విద్యుత్ చార్జీల భారాన్ని వెంటనే తగ్గించాలని మైనార్టీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ గౌస్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కరెంటు చార్జీలు పెంచి ప్రజలపై అదనపు భారం మోపవద్దని కోరారు. పేదలను ఆదుకుంటామని చెప్పిన కూటమి ప్రభుత్వం ప్రజలను మరింత కుంగదీస్తోందన్నారు. పెంచిన చార్జీలు తగ్గించకుంటే ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

వృద్ధురాలిని ఆశ్రమంలో చేర్పించిన తహసీల్దార్


వృద్ధాశ్రమంలో ఉన్న లక్ష్మీ కాంతమ్మ

మార్కాపురం రూరల్: మార్కాపురం పట్టణానికి చెందిన పబ్బతి లక్ష్మీ కాంతమ్మకు ఎవరూ లేకపోవడంతో జీవనం కోసం ఇబ్బంది పడుతోంది. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ చిరంజీవి కనిగిరిలోని వాసవీ వృద్ధాశ్రమంలో చేర్చుకోవాలని కోరడంతో నిర్వాహకులు గొంట్ల కృష్ణస్వందించారు. లక్ష్మీకాంతమ్మను వృద్ధాశ్రమంలో చేర్చుకున్నారు. వీఆర్‌ఓ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే..


తనిఖీ చేస్తున్న ఎస్సై రాజమోహన్‌రావు

మార్కాపురం: మద్యం తాగి వాహనాలు నడిపితే కచ్చితంగా జైలుకు పోవాల్సి వస్తుందని టూటౌన్ ఎస్సై రాజమోహన్‌రావు హెచ్చరించారు. మంగళవారం రాత్రి పట్టణ శివార్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలతోపాటు వాహనాల పత్రాలు తనిఖీ చేశారు. 10 మంది వాహదారులకు జరిమానా విధించారు. శివారు ప్రాంతాల్లో మద్యం తాగుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి పట్టుబడితే జైలుకు పంపుతామని హెచ్చరించారు.

మార్కాపురం తహసీల్దార్‌కు ఉత్తమ అవార్డు


సబ్‌కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం: రెవెన్యూ శాఖలోని 7 విభాగాల్లో నెల రోజుల వ్యవధిలో మార్కాపురం డివిజన్‌లో ఉత్తమ సేవలు అందించిన మార్కాపురం తహసీల్దార్ చిరంజీవికి ఉత్తమ అవార్డు లభించింది. సబ్‌కలెక్టర్ త్రివినాగ్ చేతులమీదుగా ఆయన ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న అధికారులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలు అందిస్తున్న వారికి అవార్డులు అందించాలని సబ్‌కలెక్టర్ నిర్ణయించారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

కొనకనమిట్ల: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సమస్యల పరిష్కారానికి సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయం, గ్రామ సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు, గ్రామ సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. హౌస్‌హోల్డ్ సర్వే, ఎన్‌పీసీఐ, స్వర్ణ పంచాయతీ సర్వే తీరుపై ఆరా తీశారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఈఓఆర్డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.


ప్రధాన రహదారిలో పీర్ల చావిడి వద్ద ఇదీ పరిస్థితి


అద్దరోడ్డు దగ్గర ప్రధాన రహదారి ఇలా

ఒరిగింది శూన్యం.. సమస్య పునరావృతం!


నిర్మలా కాన్వెంట్ రోడ్డు దుస్థితి


జూనియర్ సివిల్ జడ్జి కోర్టు రోడ్డు పరిస్థితి

పొదిలి:

నగర పంచాయతీగా రూపాంతరం చెందిన పొదిలి పట్టణాన్ని సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ఓ మోస్తరు వర్షం కురిస్తే చాలు ప్రధాన రహదారి వరద నీటితో నిండి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. రోడ్డు మార్జిన్లు, సైడు కాలువలు ఆక్రమణలకు గురికావటమే ప్రధాన కారణమని గుర్తించిన నగర పంచాయతీ అధికారులు హడావుడిగా సైడు కాలువలపై ఆక్రమణలను తొలగించారు. ఇందులోనూ పచ్చపాతం చూపించారనే ఆరోపణలున్నాయి. కూటమి నాయకుల సన్నిహితులు, ఆయా పార్టీల సానుభూతిపరుల దుకాణాలను వదిలేసి కేవలం కొందరినే లక్ష్యంగా చేసుకుని జేసీబీలతో దండయాత్ర చేశారు. తీరా పరిస్థితి చూస్తే కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా మారింది. ప్రణాళిక లేకుండా అధికారులు వ్యవహరించిన తీరుతో 300 మందికి పైగా చిరు వ్యాపారులు ఉపాధి కోల్పోయారే తప్ప పట్టణ ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్రమణలు తొలగించిన తర్వాత నూతన రహదారి, డ్రెయినేజీ, డివైడర్ నిర్మిస్తారని ఆశించిన ప్రజలకు అధికారులు స్వల్ప వ్యవధిలోనే షాక్ ఇచ్చారు. ఎవరి దుకాణం ముందు వారే డ్రెయినేజీ నిర్మించుకోవాలని చెప్పడంతో దుకాణదారులు, ఆయా భవనాల యాజమానులు ఖంగుతిన్నారు.

- పొదిలిలో ఫలితమివ్వని ఆక్రమణల తొలగింపు
- కానివారిని వేధించేందుకే రాజకీయ నేతల డ్రామా
- 'కూటమి' సానుభూతిపరుల జోలికి వెళ్లని అధికారులు
- దుకాణాల ముందు మెరక తోలడంతో పరిస్థితి యదాతథం

మొదటికొచ్చిన పరిస్థితి

ఎవరి దుకాణాల ముందు వారు మళ్లీ మెరక తోలడంతో పరిస్థితి మొదటికొచ్చింది. వర్షం కురవగానే నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. ప్రధాన రహదారిలోని అద్దరోడ్డు సమీప ప్రాంతం, పెద్ద మసీదు ఏరియా, ఎంపీడీఓ కార్యాలయం, పెద్ద బస్టాండ్, చిన్న బస్టాండ్ ప్రాంతాల్లో వర్షం నీరు భారీగా నిలుస్తోంది. ట్రాఫిక్ సమస్య ఎప్పటిలాగే ఉంది. ఆక్రమణల తొలగింపు ఎందుకు చేశారో, దాని మూలంగా వచ్చిన ఫలితం ఏమిటో అధికారులకే తెలియాల్సి ఉంది.

అధ్వానంగా అంతర్గత రహదారులు

పట్టణంలో ప్రధాన రహదారి దారుణంగా ఉండగా, అంతర్గత రహదారుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. మట్టి రోడ్లపై మోకాలి లోతు గుంతల్లో రాకపోకలు సాగించలేక పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం జన సంచారం ఉండే కోర్టు, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం రోడ్డు, నిర్మలా కాన్వెంట్ రోడ్డులో రాకపోకలకు జనం ఇబ్బంది పడుతున్నారు. నిర్మలా కాన్వెంట్ రోడ్డులో చిన్న పిల్లలు పాఠశాలలకు రాకపోకలు సాగించలేక తంటాలు పడుతున్నారు.

రూ.11 కోట్లు విడుదలయ్యేనా?

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పొదిలి పట్టణంలో ప్రధాన రహదారిని అభివృద్ధి చేయడంతోపాటు డ్రెయినేజీ, డివైడర్ నిర్మించేందుకు అప్పటి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి చొరవ చూపారు. మార్కాపురం పర్యటనకు వచ్చిన నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పొదిలి పట్టణవాసుల సమస్యను వివరించడంతో రూ.11 కోట్లు మంజూరు చేశారు. సంబంధిత పనులకు ప్రతిపాదనలు పంపగా పరిపాలనా పరమైన అనుమతులు మంజూరయ్యాయి. ఎన్నికల నేపథ్యంలో నిధుల విడుదలకు బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలైనా ఆ నిధులకు సంబంధించిన ఫైలు ముందుకు కదలడం లేదు. నియోజకవర్గ ముఖ్య నేతలు స్పందించి ప్రభుత్వం నుంచి నిధులు రాబడితే ప్రధాన రహదారిలో ట్రాఫిక్, డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పట్టణ వాసులు ఆశిస్తున్నారు.

విభిన్న ప్రతిభావంతుల ఉన్నతికి పాటుపడాలి


పొదిలిలో చిన్నారులకు బహుమతులిస్తున్న సీడీపీఓ సుధామారుతి


తర్లుపాడులో బహుమతులు అందిస్తున్న ఎంపీపీ భూలక్ష్మి, తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు


మార్కాపురం : విభిన్న ప్రతిభావంతులతో ఎంఈవోలు, ఉపాధ్యాయులు


కంభం : విద్యార్థులకు బహుమతులందిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

మార్కాపురం టౌన్: సమాజంలోని ప్రతి ఒక్కరూ విభిన్న ప్రతిభావంతుల ఉన్నతికి పాటుపడాలని ఎంఈఓలు రాందాస్‌నాయక్, శార్వాణి కోరారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని హెచ్‌ఎం ఎం.చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడం ద్వారా సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న విభిన్న ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు ఆంజనేయులు, రామాంజనేయరెడ్డి, శివ శంకర్‌రెడ్డి ఎవరికీ తీసిపోరని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. పోటీల్లో విజేతకు బహుమతులు అందజేశారు. తల్లిదండ్రులు, విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ వెంకట్రామిరెడ్డి, భవిత సెంటర్ ఐఈఆర్‌టీ డి.శ్రీనివాసులు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

తర్లుపాడు: దివ్యాంగుల్లో సామాజిక చైతన్యం కలిగించి సమాజంలో వారిని భాగస్వామ్యం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీఓ చక్రపాణి అన్నారు. మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సమాన గౌరవం, సమాన అవకాశాలు పొంది సమాజంలో గౌరవంగా బతికేలా దివ్యాంగులకు అండగా ఉండాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం ప్రత్యేక బాలలకు ఎంపీపీ భూలక్ష్మి బహుమతులు అందించి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 సుబ్బారావు, హెచ్‌ఎం మస్తానయ్య, ప్రవీణ్, ఉపాధ్యాయులు అనంత లక్ష్మి, వనిత జ్యోతి, కృష్ణవేణి, జగన్‌బాబు, చైర్మన్ ఫిరోజ్ పఠాన్, వాసవీక్లబ్ సభ్యులు రత్తమ్మ, నెహ్రూ యూత్ అధ్యక్షుడు పులయ్య పాల్గొన్నారు.

కొనకనమిట్ల: అంగవైకల్యం విద్యాభివృద్ధికి అడ్డు కాదని ఎంఈఓ-2 బి.నరసింహారావు పేర్కొన్నారు. మంగళవారం ఎదురాళ్లపాడు భవిత కేంద్రం, గొట్లగట్టు జెడ్పీ పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభాకరరావు, విజయలక్ష్మి, ఫిజియోథెరపీ వైద్యుడు ప్రవీణ్‌కుమార్, ఐఈడీ రిసోర్స్ పర్సన్లు పద్మజ, జయలక్ష్మి పాల్గొన్నారు.

పొదిలి: విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో చిన్నారులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, ఐసీడీఎస్ సీడీపీఓ సుధామారుతి ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, సంస్థ సభ్యులు సామంతపూడి నాగేశ్వరరావు, బీవీ రెడ్డి, రోటీ యస్దాని, కిరణ్మయి, వరికూటి శిరీష, సూపర్‌వైజర్ ఎస్.సుభాషిణి, భవిత కేంద్రం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

కంభం: సమగ్ర సుస్థిర భవిత కోసం దివ్యాంగుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించాలని ఎంఈఓలు మాల్యాద్రి, శ్రీనివాసులు సూచించారు. స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వ్యక్తిగత శిక్షణ ద్వారా అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బైసాని రామకృష్ణ, వరికుంట్ల వెంకటేశ్వర్లు, ఉర్దూ డీఐ మోయినుద్దీన్, ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉప్పువాగు వద్ద రోడ్డు పక్కన వ్యర్థాల్లో పందులు

డంపింగ్ హైవే..!


కంభం ఎంట్రన్స్‌లో నేషనల్ హైవే పక్కన వ్యర్థాలు

బేస్తవారిపేట: మండలంలోని సోమవారిపేట సమీపంలో ఉప్పువాగుపై, కంభం ఎంట్రన్స్‌లో తోకపల్లె-కడప నేషనల్ హైవే పక్కన దుర్వాసన స్థానికులతోపాటు వాహనదారులను ఇబ్బంది పెడుతోంది. కొబ్బరి బొండాలు, కోళ్ల వ్యర్థాలు, చెడిపోయిన కూరగాయలు, ఉల్లిపాయలు పడేస్తుండటంతో అవి కుళ్లి విపరీతమైన దుర్వాసన వస్తోంది. రాకపోకల సమయంలో ప్రయాణికులు ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి. పైగా వ్యర్థాల వద్ద గుంపులు గుంపులుగా పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం


స్వామివారి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


కళ్యాణానికి హాజరైన భక్తులు

మార్కాపురం టౌన్: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని అర్చకులు వేదమంత్రాల మధ్య ఘనంగా నిర్వహించారు. మంగళవారం నెహ్రూబజారులోని షిర్డీ సాయిబాబా మందిరంలోని చంద్రమౌళీశ్వర ఉపాలయంలో కళ్యాణోత్సవం కనుల పండువగా సాగింది. అర్చకులు మైలటూరి రవి, రంగా ఉదయం స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదాతలుగా శ్రీనాథ్, పద్మావతి వ్యవహరించారు. కళ్యాణోత్సవంలో సుమారు 500 మంది భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఆలయ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, కార్యదర్శి జీ.హరిహరరావు, కోశాధికారి నాగరాజు, ఆర్.నాగగోపి, కమిటీ సభ్యులు, మహిళా సభ్యులు, యువజన సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

- జీజీహెచ్ సూపరింటెండెంట్ వనజ


పౌష్టికాహారాన్ని అందిస్తున్న డాక్టర్ వనజ, పక్కన మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ మారుతి, సిబ్బంది

మార్కాపురం: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చని జీజీహెచ్ సూపరింటెండెంట్ వనజ రత్నకుమారి, జీజీహెచ్ ప్రిన్సిపాల్ మారుతి తెలిపారు. మంగళవారం స్థానిక జీజీహెచ్‌లో వైఆర్‌జీ కేర్ సహకారంతో 30 మంది హెచ్ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు నెలరోజులకు సరిపడా పౌష్టికాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏఆర్టీ సెంటర్‌లో ఉచితంగా అందించే మందులను హెచ్ఐవీ బాధితులు వినియోగించుకోవాలని సూచించారు. ఆకు కూరలు, పండ్లు ఆహారంలో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్లు బి.హర్షవర్ధన్‌రెడ్డి, సీహెచ్ సాయికిరణ్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాసులు, నిట్టూరి మురళీ, ఎం.పోతురాజు, కె.మహాలక్ష్మి, ఎం.రామారావు, వైఆర్‌జీ కేర్ సిబ్బంది జయలక్ష్మి, లక్ష్మి, వెంకటపతి, మహేశ్వరి, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి


బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీఐ మల్లికార్జున

బేస్తవారిపేట: విద్యార్థులు చదువుపై పూర్తి శ్రద్ధ పెట్టాలని కంభం సీఐ మల్లికార్జున సూచించారు. మంగళవారం బేస్తవారిపేటలోని జెడ్పీ బాలుర హైస్కూల్, యశ్వంత్ జూనియర్ కళాశాల, ఆల్ఫా హైస్కూల్లో సైబర్ క్రైమ్, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ ఎక్కువగా ఉపయోగించవద్దని సూచించారు. ఓటీపీలు చెప్పమని, బ్యాంక్‌ల నుంచి మాట్లాడుతున్నామని వివరాలు చెప్పాలంటూ పలు రకాల మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. రోజూ వార్తా పత్రికలు చదవడం ద్వారా సమాజంలో జరుగుతున్న మంచి, చెడుపై అవగాహన ఏర్పడుతుందన్నారు. జెడ్పీ బాలుర హైస్కూల్లో దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్‌పీ రవీంద్రారెడ్డి, హెచ్‌ఎం ఎంఎస్ శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు బానిస కావద్దు


మాట్లాడుతున్న ఎస్సై సైదుబాబు

మార్కాపురం: యువత వ్యసనాలకు బానిసలై భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని పట్టణ ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌రావు సూచించారు. మంగళవారం కమలా జూనియర్ కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సైలు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు. ఫేక్ ఎస్ఎంఎస్‌లు, ఓటీపీ, బ్యాంక్ ఫ్రాడ్ కాల్స్, వాట్సప్‌లో ఫేక్ లోన్ యాప్ కేవైసీ పెండింగ్ మోసాలపై యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ బాధితులైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ పి.పవన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కొమరోలు : నీటమునిగిన పంట పొలాలు


కొమరోలు : సూరవారిపల్లె గ్రామం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

పొంగిన వాగులు, వంకలు

- కొమరోలులో కుండపోత వాన
- దాదాపు 4 గంటల పాటు కురిసిన భారీ వర్షం
- పంట పొలాల్లో నిలిచిన వర్షం నీరు

కొమరోలు: మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. 4 గంటలపాటు కురిసిన భారీ వర్షానికి రహదారులతోపాటు పంట పొలాలు నీటమునిగాయి. గృహాల్లోకి వర్షం నీరు చేరడంతో గృహ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొమరోలు బీసీ కాలనీలోని గృహాల్లోకి వర్షం నీరు చేరింది. ఎస్‌బీఎన్‌ఆర్‌ఎం పాఠశాల రహదారిలో మోకాలి లోతులో వర్షం నీరు నిలిచిపోయింది. రెడ్డిచెర్ల ఎస్సీపాలెంలో గృహాల్లోకి వర్షం నీరు చేరింది. అలాగే మండలంలోని పంట పొలాలు వర్షం నీటితో మునిగాయి. బాదినేనిపల్లె, సూరవారిపల్లె గ్రామాల వద్ద పులివాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లు నాయక్ పోలీసు సిబ్బందిని వాగుల వద్ద ఉంచి ప్రజలను అప్రమత్తం చేశారు. భారీ వర్షంతో మధ్యాహ్నం పాఠశాలలకు సెలవు ప్రకటించారు. గిద్దలూరు వ్యవసాయ విస్తరణాధికారి బాలాజీనాయక్ నీటమునిగిన పంట పొలాలను మంగళవారం మధ్యాహ్నం ఏవో రాజశ్రీతో కలిసి పరిశీలించారు.


కొమరోలు : బాదినేనిపల్లె వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పులివాగు


కొమరోలు : రెడ్డిచెర్ల వద్ద నీటమునిగిన పంటను పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్


కొమరోలు : ఎస్‌బీఎన్‌ఆర్‌ఎం పాఠశాల వద్ద మోకాలి లోతులో నిలిచిన వర్షం నీరు